



గద, నాగలితో పవన్ కల్యాణ్, చంద్రబాబు





వేదికపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ అభివాదం

గూడెంలో ఉమ్మడి సభ

సూపర్ హిట్

రాష్ట్ర భవిష్యత్ కోసమే కలిశాం


ఆశీర్వదించండి.. గెలిపించండి

- ఉమ్మడి వేదికపై చంద్రబాబు, పవన్ పిలుపు
- సభ భావోద్వేగాలు.. అభిమానుల కేరింతలు
- దూర ప్రాంతాల నుంచి భారీగా రాక
- ఎన్నికల ముందే టీడీపీ-జనసేన శ్రేణులకు అధినేతల దిశా నిర్దేశం

తాడేపల్లిగూడెం/ఏలూరు/భీమవరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): 'టీడీపీ-జనసేన పొత్తు తాడేపల్లి ప్యాలెస్‌ను కకావికలం చేస్తోంది. రాష్ట్ర ప్రయోజనాల కోసం, వివిధ వర్గాల భవిష్యత్తు కోసం మేం కలిశాం. మమ్మల్ని ఆశీర్వదించండి.. గెలిపించండి' అంటూ టీడీపీ-జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. అత్యంత ఉద్వేగంతో వైసీపీ పైకి వారు సవాళ్లు విసిరారు. ఇది నిజమా..? కాదా ? అంటూ సభికుల నుంచి సమాధానాలు రాబట్టిన ప్రసంగాలు సాగిన తీరు అందరిని హత్తుకుంది. 'తెలుగు జన విజయ కేతనం జెండా' పేరిట పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సమీపంలోని ప్రత్తిపాడు వద్ద బుధవారం సాయంత్రం నాలుగున్నరకు మొదలైన భారీ బహిరంగ సభ రాత్రి ఎనిమిది గంటల వరకు సాగింది. టీడీపీ-జనసేన ఎన్నికల పొత్తులో భాగంగా ఇటీవల 99 మంది పోటీ చేసే అభ్యర్థులతో తొలి జాబితాను ఇరు పార్టీలు ప్రకటించాయి. దీని తర్వాత ప్రజలకు ఉమ్మడి సంకేతం ఇచ్చేందుకు సాగిన సభకు తొలిసారిగా అధినేతలు ఇద్దరు ఒకే వేదిక పైకి వచ్చారు. ఇది అటు పవన్ అభిమానులకు, ఇటు చంద్రబాబు కేడర్‌కు పండుగగా మారింది. ఇరువురు నేతలు పరస్పర ఆలింగనాలు సభికులకు మరింత కనువిందు చేసింది. ప్రత్యేకించి పొత్తు ఆ తదుపరి అభ్యర్థుల ప్రకటన తర్వాత ఎంతో క్రమశిక్షణతో నేతలు ఇద్దరు ఉమ్మడిగా జరిగిన సభలో అందరి మనసులు దోచారు. చంద్రబాబు సైతం సుమారు 50 నిమిషాలపాటు ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. ఎన్నికల ముందు ముద్దులు.. గెలిచాక మీడియాతో సహా అందరిపైన పిడిగుద్దులా అంటున్నపుడు సభికులు అవును అవునంటూ తెలిపారు.

రెండు కలిసే నడుస్తున్నాయి : చంద్రబాబు

'ప్రజలకు రోషం ఉందా.. మాకైతే రోషం ఉంది. ఒక సీనియర్‌గా జరుగుతున్నందంతా చూస్తూ ఊరుకోలేను. ప్రశ్నించే గుణం ఉన్నా పవన్ సైతం మౌనంగా ఉండలేదు. జనం కోరుకునే వెలుగు మీకు ఇచ్చే బాధ్యత మాది' అంటూ చంద్రబాబు భరోసా ఇవ్వడం అందరిని సంతృప్తి పరిచింది. రాష్ట్ర విభజన అంశాలు ప్రజలకు గుర్తు చేస్తూ అప్పట్లో జరిగిన నష్టాన్ని ఎత్తి చూపాం. ఇప్పటికి అదే ధోరణిలో రాష్ట్రాభివృద్ధికి అనువుగానే జనసేన టీడీపీ లక్ష్యాల తీరు ఉందని చంద్రబాబు ప్రజలకు పదే పదే వివరించారు. ప్రజల కోసం కన్న కలల సౌధాన్ని జగన్ వచ్చి నాశనం చేశాడు. పొత్తు ఎందుకని ఆలోచిస్తే అందరికి అవగాహన వస్తుంది. ఆఖరికి అంతర్జాతీయ క్రికెటర్ విహారిని రాష్ట్రం నుంచి పారిపోయేలా చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదే అంటూ గుర్తు చేసినప్పుడు షేమ్ షేమ్ అంటూ సభికులు ప్రతిస్పందించారు. రాష్ట్రంలో కులాల మధ్య ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించి సర్వనాశనం చేయాలని, ఆ దిశగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. కాని, నేను, పవన్ రాష్ట్రాన్ని నెంబర్-1 చేయాలనుకుంటున్నాం. సినిమా టిక్కెట్లలోను రాజకీయాలు చేయడం ఎంత వరకు సబబు. ఇది భావ్యమా' అంటూ ప్రశ్నించి సభికుల నుంచి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు. వచ్చే ఎన్నికల్లో మన గెలుపును ఎవరూ ఆపలేరని, బాధ్యత కలిగిన అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేశామని మాఫియా నేతలు కావాలా.. మంచి నేతలు కావాలంటూ ప్రజలను ప్రశ్నించారు. ఉద్యోగుల



సభలో ప్రసంగిస్తున్న పవన్ కల్యాణ్

అంశాలను ప్రస్తావిస్తూ ఇప్పుడున్న ప్రభుత్వం ఉద్యోగులపై ఇష్టానుసారంగా వ్యవహరిస్తోంది. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏం చేయబోతున్నామో త్వరలోనే ప్రకటిస్తామన్నారు. కిందిస్థాయి కేడర్‌లో ఉన్న భావాలను స్పృశిస్తూ ..ఇగోలకు పోవద్దు.. ఒక పార్టీ వెనుక ఇంకో పార్టీ నడుస్తున్నట్టు భావిస్తారు. ఇదంతా కాదు రెండు పార్టీలు కలిసి నడుస్తాయని భావించాలని, అనుభవంతో చెబుతున్నానని చంద్రబాబు ప్రకటించినప్పుడు టీడీపీ-జనసేన కేడర్ సంతృప్తితో కేరింతలు కొట్టారు. టీడీపీ కేడర్ ఎంపిక తీరుపై అక్కడక్కడ అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా పరోక్షంగా ప్రస్తావిస్తూ అందరికి తగిన న్యాయం చేయడం సాధ్యం కాదని, అవకాశాలను బట్టి అందరికి ఆమోదయోగ్యంగా న్యాయం చేస్తామన్నారు. పవన్ కల్యాణ్



వేదికపై చంద్రబాబు, పవన్ కల్యాణ్, బాలకృష్ణ తదితరులు

కూడా కాస్తంత ఉత్తేజభరితంగానే మాట్లాడుతూ కేడర్‌కు దిశా నిర్దేశం చేశారు. ఇంతకు ముందు జరిగిన తన ఓటమిని గుర్తు చేసుకున్నారు. పొత్తులో జనసేన ఎన్ని సీట్లు తీసుకోవాలి.. సీఎం పదవిని ఎలా పంచుకోవాలి అంటూ లేఖలతో సలహాలు ఇచ్చిన వారందరికి నర్మగర్భంగా మాట్లాడుతూ చెక్ పెట్టారు. ఆయన ఏమన్నారంటే.. 'నాకు ఎవరి సలహాలు అక్కరలేదు. జిల్లా నుంచి ఇటీవల సలహాలు ఇస్తూ బహిరంగ లేఖలు రాస్తున్నారు. కొందరు సీనియర్ల లేఖలు పొత్తుపై ప్రభావం చూపుతున్నాయి. ఒంటరిగా పోటీ చేసే శక్తి ఇప్పటికిప్పుడు జనసేనకు లేదు. నాపై విమర్శలు చేసే వారు ముందుగా దీనిపై ఆలోచించాలి. జగన్ వెనుక ఉన్న సమూహాలు మాత్రం తప్పు చేసినా దోపిడీ చేసినా ఆహా.. ఓహో అంటూ ఉన్నారు. వెనకేసుకొస్తున్నారు. కాని, సామాన్యుడు రాజకీయం చేస్తే ఇలాగే ఉంటుందని నిరూపిస్తా. ఎవరికి ఎంత ఓపికో పరీక్షించుకోవాలి. నాతో నిలబడి.. నా వెంట నడిచేవారే నా



సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు

వాడు'.. అంటూ పవన్ ఉద్వేగంగా మాట్లాడటంతో సభికుల నుంచి స్పందన లభించింది. ప్రత్యేకించి సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన చంద్రబాబు, నేను రాష్ట్రం కోసమే కలిసి పని చేస్తామంటూ స్పష్టం చేశారు.

అందరి చూపు వేదిక మీదే..

ఓ వైపు సభా సమయం రాత్రి గడుస్తున్నా అందరిచూపు వేదిక మీదే వుంది. టీడీపీ-జనసేన రాష్ట్ర నియోజకవర్గ నేతలు ఆసీనులు కావడమే నిదర్శనం. ఏ ఒక్క పార్టీ తక్కువ కాదని అంతా సమానమేనని అన్నట్టుగా వేదికపైన మొత్తం 500 మంది కూర్చోగా రెండు పార్టీల నేతలకు చెరి సగం అన్నట్టుగానే సభా వేదిక ఏర్పాటు చేశారు. ఒక వైపు టీడీపీ జెండా, మరో వైపు జనసేన జెండా ఉండేలా ఈ పతకాల కిందే ఇరు పార్టీలు నేతలు ఆసీనులయ్యారు. ప్రత్యేకించి జనసేనలో కొత్తగా చేరిన కొత్తపల్లి సుబ్బారావు, కొణతాల రామకృష్ణ వంటి సీనియర్ నేతలు సైతం కొద్దిసేపు ప్రసంగించారు. రామకృష్ణ అయితే జనసేన టీడీపీ మాదిరిగానే ఈ రెండింటితో బీజేపీ కలిసి వచ్చేలా చూడాలని కోరడం మరో విశేషం. పవన్ తమ ప్రసంగం ఆఖరిలో బీజేపీకి జై అంటూ ముగించారు. టీడీపీ పక్షాన వేదిక ముందు భాగంలో చంద్రబాబుతోపాటు అచ్చెన్నాయుడు, బాలకృష్ణ, సీతారామలక్ష్మి, పితాని సత్యనారాయణ, వలవల బాబ్జి, రఘురామకృష్ణంరాజు కూర్చుండగా పవన్ పక్కన నాదెండ్ల మనోహర్, కొణతాల రామకృష్ణ, కొటికలపూడి గోవిందరాజు, కందుల దుర్గేష్, బొలిశెట్టి శ్రీనివాస్ ఉన్నారు. టీడీపీలో సీనియర్ నేతలు బుచ్చియ్యచౌదరి, చినరాజప్పతో పాటు కొలుసు పార్థ సారథి, చింతమనేని ప్రభాకర్, ముళ్లపూడి బాపిరాజు, కంభంపాటి రామ్మోహన్, నిమ్మల రామానాయుడు, పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత పాల్గొన్నారు.

జనమే జనం

రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున జనం తరలి వచ్చారు. ఇరు పార్టీల అగ్రనేతలు ఒకే వేదిక పైకి రావడంతో ఈ వేదికకు రాజకీయ ప్రాధాన్యం పెరిగింది. దీంతో వివిధ నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నేతలు తరలి వచ్చారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, పవన్ వేదిక పైకి రాక ముందే పలువురు సీనియర్లు ప్రసంగించారు. నిమ్మల రామానాయుడు, రఘురామకృష్ణంరాజు, బాలకృష్ణ, వలవల బాబ్జి, దుర్గేష్, కొత్తపల్లి సుబ్బారాయుడు వంటి వారు మాట్లాడడంతో జనం కేరింతలతో సభ దద్దరిల్లింది. రఘురామకృష్ణంరాజు సెటైర్లు వేస్తున్నపుడు వేదికపై ఉన్న పవన్, చంద్రబాబు ముసిముసి నవ్వులు చిందించారు. తాను వచ్చే ఎన్నికల్లో నరసాపురం నుంచి పోటీ చేస్తానని రఘురామకృష్ణంరాజు వ్యాఖ్యానించినప్పుడు సభలో కేరింతలు వినిపించాయి.

అభిమానుల జోష్

తెలుగుదేశం-జనసేన ఉమ్మడి సభలో అభిమానుల జోష్ అంతా ఇంతా కాదు. కార్యకర్తలను, అభిమానులను అదుపు చేయడం పోలీసులు తరం కాలేదు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లను వీక్షించేందుకు ఫ్లడ్‌లైట్ స్తంభాలను ఎక్కేశారు. మహిళలు అందుకు పోటీ పడ్డారు. పసుపు చీరలు ధరించి వేలాదిగా మహిళలు సభకు తరలి వచ్చారు.



సభలో టీడీపీ నాయకులు



సభలో జనసేన నాయకులు

రోజుకో మలుపు

- కోనసీమలో అనుక్షణం మారుతున్న రాజకీయ పరిణామాలు
- సీటు కేటాయించలేదు.. అభ్యర్థినీ ప్రకటించలేదు : జనసేన ఇన్‌చార్జి రాజబాబు వివరణ
- సీఎం సమక్షంలో వైసీపీలో చేరిన గొల్లపల్లి
- నేడు గన్నవరానికి టీడీపీ అభ్యర్థి రాజేష్ రాక

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రాజకీయ పరిణామాలు రోజుకో రీతిన మలుపులు తిరుగుతున్నాయి. టీడీపీ, జనసేన అభ్యర్థుల ప్రకటన తర్వాత రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. సీటు దక్కలేదని కినుక వహించిన టీడీపీకి చెందిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు బుధవారం వైసీపీలో చేరారు. అధిష్ఠానం ప్రకటించకుండానే అమలాపురం నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించారని, అభ్యర్థిగా శెట్టిబత్తుల రాజబాబుకు ఖరారు చేశారంటూ ఆ పార్టీ కార్యకర్తలు సంబరాలు చేసుకున్న వ్యవహారం వివాదాస్పదమైంది. జనసేనకు అమలాపురం ఇంకా కేటాయించలేదని, అభ్యర్థిగా తన పేరు ఖరారు చేయలేదంటూ జనసేనకు చెందిన శెట్టిబత్తుల రాజబాబు వివరణ ఇచ్చుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. పి.గన్నవరం ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిన సరిపెల్ల రాజేష్ అలియాస్ మహాసేన రాజేష్ గురువారం నియోజకవర్గంలోకి అడుగిడనుండడంతో ఉత్కంఠత నెలకొంది. తాడేపల్లిగూడెంలో జరిగిన టీడీపీ-జనసేన ఉమ్మడి సభకు పి.గన్నవరం సహా కొన్ని ప్రాంతాల నుంచి టీడీపీ కేడర్ డుమ్మా కొట్టిన పరిణామాలు సర్వత్రా చర్చనీయాంశమైంది.

అమలాపురం అసెంబ్లీ సీటును జనసేనకు కేటాయించారంటూ మంగళవారం రాత్రి కొందరు సంబరాలు చేసుకున్న వ్యవహారం మీడియాలో వచ్చింది. అమలాపురం సీటుపై గానీ, అభ్యర్థి ఎంపికలో గానీ ఎటువంటి నిర్ణయం తీసుకోలేదంటూ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజబాబు మీడియా సందేశం ద్వారా వివరణ ఇచ్చారు. ఇరుపార్టీల అధ్యక్షులు అధికారికంగా ప్రకటించిన తర్వాతే మనం సంబరాలు చేసుకోవాలి. అప్పటి వరకు సంయమనం పాటించాలని కార్యకర్తలకు హితవు పలికారు. కాగా మంగళవారం రాత్రి జనసేన కార్యకర్తలు సెంటర్లో చేసిన హంగామాపై డీఎంఆర్ శేఖర్ వర్గీయులు పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు.

రాజోలు నియోజకవర్గం జనసేనకు సిటింగ్ స్థానం కావడంతో అక్కడి నుంచి జనసేన అభ్యర్థే బరిలోకి దిగుతారని ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. దాంతో అప్పటి వరకు ఆస్థానంపై ఆశ పెట్టుకుని పనిచేసిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. టీడీపీ అధిష్ఠానం తనకు అన్యాయం చేసిందంటూ ఆవేదన చెందుతూ ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. బుధవారం సూర్యారావు, ఆయన కుమారుడు శ్రీధర్, గతంలో పి.గన్నవరం నుంచి టీడీపీ తరఫున పోటీచేసి ఓటమి చెందిన నేలపూడి స్టాలిన్ సహా పలువురు జగన్ సమక్షంలో వైసీపీ కండువా కప్పుకున్నారు. కాగా గొల్లపల్లి వైసీపీలో చేరడం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావుకు ఏమాత్రం ఇష్టం లేదు. గొల్లపల్లి పార్టీలో చేరే కార్యక్రమానికి సైతం రాపాక దూరంగా ఉన్నారు. అయితే ఎంపీ మిథున్‌రెడ్డి పిలుపుతో రాపాక బుధవారం తాడేపల్లి పయనమైనట్టు తెలిసింది. ఇప్పుడు రాజోలు స్థానాన్ని గొల్లపల్లికి ఇస్తారా, రాపాకకు ఇస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గంలో టీడీపీ కేడర్ నుంచి ముగ్గురు, నలుగురు నాయకులు మాత్రమే వైసీపీ వైపు మళ్లినట్టు సమాచారం. ప్రస్తుతం రాజోలు నియోజకవర్గంలో టీడీపీ కేడర్ బలంగానే ఉందని ఆ పార్టీ వర్గీయులు ప్రకటిస్తున్నారు.

పి.గన్నవరం టీడీపీ అభ్యర్థిగా ప్రకటితమైన సరిపెల్ల రాజేష్ అలియాస్ మహాసేన రాజేష్ గురువారం నియోజకవర్గానికి రానున్నట్టు సమాచారం. సమన్వయ కమిటీ సభ్యులతో పాటు ఇతర నేతలకు తన రాకకు సంబంధించిన సమాచారాన్ని తెలియచేసి వారిని ఆహ్వానిస్తున్నట్టు తెలిసింది. రాజేష్ అభ్యర్థిత్వంపై టీడీపీ, జనసేన శ్రేణులు తీవ్ర ఆగ్రహంతో ఉన్న నేపథ్యంలో ఆయన రాకపై ఉత్కంఠత నెలకొంది. గురువారం ఉదయం అయినవిల్లి ఆలయానికి వస్తారని, అక్కడి నుంచి ప్రచారానికి శ్రీకారం చుడతారన్న సమాచారంతో అసంతృప్తివాదులు ఆయన పర్యటనను వ్యతిరేకిస్తున్నారు. మరోవైపు నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులు తాడేపల్లిగూడెం సభకు సైతం పెద్దగా తరలివెళ్లలేదు. జనసేన నైతలైతే భారీగానే వెళ్లినట్టు సమాచారం. దీనికితోడు నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో రాజేష్ రాక ఏ పరిణామాలకు దారితీస్తుందోనన్న ఉత్కంఠ టీడీపీ, జనసేన కేడర్లలో నెలకొంది.



రైతు భరోసా చెక్కు అందజేస్తున్న జేసీ నుపూర్‌అజయ్

రైతులకు రూ.33.33 కోట్ల లబ్ధి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 28: వైఎస్సార్ రైతు భరోసా మూడో విడతగా జిల్లాలోని 1,65,656 మంది రైతులకు రూ.33.33 కోట్ల ఆర్థిక సాయం అందిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, రైతు నాయకుడు జిన్నూరి బాబి, హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాలమునికుమారి, వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్, ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు తదితరులు పాల్గొన్నారు.

'ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులు సమయపాలన పాటించాలి'

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 28: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు సమయపాలన పాటించాలని ఇంటర్ బోర్డు కమిషనర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సౌరభ్ గౌర్ సూచించారు. ఇంటర్మీడియట్ బోర్డు అధికారులతో బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి పలు సూచనలు చేశారు. విద్యార్థులు ఉదయం 8.30 నుంచి 9 గంటలలోపు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఆ తర్వాత అనుమతించరని స్పష్టం చేశారు. పూర్తిగా పరీక్ష రాసినా సరే చివరి అర గంటలోపు విద్యార్థులను బయటకు పంపరన్నారు. ఈ ఏడాది నుంచి 12 గంటల వరకు అదే గదిలో ఉండాల్సిందేనన్నారు. ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థులకు ఒక గంట అదనపు సమయం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి వి.సోమశేఖరరావు, ఇంటర్మీడియట్ బోర్డు పబ్లిక్ పరీక్షల నిర్వహణ సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలుపై శిక్షణ



అధికారులకు శిక్షణ ఇస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇస్తున్నామని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలో ఎన్నికల నోటిఫికేషన్ అమలులోకి వచ్చిన తరువాత నిర్వహించాల్సిన బాధ్యతలపై కలెక్టర్ అధ్యక్షతన శిక్షణ ఇచ్చారు. జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు చేయడం, అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల పరిశీలనలో ముఖ్య పాత్ర పోషించే ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్‌లో ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అధికారాలు కలిగిన ఒక అధికారితో పాటు పోలీసు శాఖ నుంచి ఒక అధికారి, ముగ్గురు సిబ్బంది, ఒక వీడియోగ్రాఫర్ ఉంటారు. ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో షిఫ్ట్‌లో మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు పనిచేసేలా తగినంత సిబ్బందిని నియమించామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు సంబంధించిన ఫిర్యాదులు నగదు, మద్యం పంపిణీ చేయడం తదితర అంశాలపై అందిన ఫిర్యాదులు, రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల ఖర్చులకు సంబంధించిన ఫిర్యాదులు అందితే సమాచారం తెలిసిన 30 నిమిషాల్లోపు ఆ ప్రాంతానికి చేరుకుని వీడియోగ్రాఫర్ సహాయంతో వీడియోతీసి ఆ ప్రాంతంలో దొరికిన వస్తువులు, నగదును సీజ్‌చేసి 24 గంటల్లోపు సంబంధిత కోర్టుల్లో హాజరుపరచాలన్నారు. ఎన్నికల ఖర్చులు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్న ప్రాంతాల వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటుచేసి పర్యవేక్షించే బాధ్యత స్టాటిక్ సర్వే లెన్స్ బృందాలకు ఉందన్నారు. అక్రమ మద్యం, పెద్ద మొత్తంలో నగదు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి రవాణా వంటి వాటిని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. వీడియో సర్వే లెన్స్ టీమ్‌లో ఒక అధికారితో పాటు వీడియోగ్రాఫర్ ఉంటాడు. వీరు ఫ్లయింగ్ స్క్వాడ్ నేతృత్వంలో రాజకీయ పార్టీల నాయకులు నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభలను వీడియో తీస్తారు. సీ-విజిల్, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ సాఫ్ట్‌వేర్‌ను మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్న సమయంలో వినియోగించి ఫ్లయింగ్ స్క్వాడ్‌లు సీజ్ చేసిన వస్తువుల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనలను నివేదించడానికి సీ-విజిల్ పౌరులకు ఉపయోగపడుతుంది. శిక్షణలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, అడ్మిన్ ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వే లెన్స్ బృందాల సభ్యులు పాల్గొన్నారు.

జెండా జోష్



వేదికపై జనసేన పార్టీ నాయకులు





తెలుగుదేశం పార్టీ నాయకులు



దాహం తీర్చేందుకు చల్లని మజ్జిగ



ఒళ్లంతా జెండాలతో..





అన్న..ఎన్టీఆర్



ఫ్లడ్‌లైట్, ఫ్లెక్సీ స్తంభాలపై అభిమానులు

పశ్చిమ గోదావరి జిల్లా ప్రత్తిపాడులో బుధవారం జరిగిన టీడీపీ-జనసేన ఉమ్మడి సభకు జనం పోటెత్తారు.. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌లు తమ ప్రసంగాలతో ఇరుపార్టీల కార్యకర్తల్లో జోష్ నింపారు. ఉభయగోదావరి జిల్లాలతో పాటు, కృష్ణా, గుంటూరు, విశాఖ జిల్లాల నుంచి కార్యకర్తలు, అభిమానులు సభకు హాజరయ్యారు.



వయసు పైబడినా తగ్గేదేలే..



ఊరేగింపుగా రెక్కలు విరిగిన ఫ్యాన్



తెలుగు మహిళల సందడి



తాడేపల్లిగూడెం నుంచి జనసేన ర్యాలీ





వేదిక ముందు యువత ఉత్సాహం

వివాహేతర సంబంధం అనుమానంతో దాడి

ఎదురింటి వ్యక్తిపై కత్తితో దాడిచేసిన ఎంపీటీసీ

తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చేరిక

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 28: తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో ఇంటి ఎదురుగా ఉన్న వ్యక్తిపై ఎంపీటీసీ పదునైన కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అమలాపురం పట్టణ సీఐ కె.క్రిస్టఫర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఈదరపల్లి రామాలయం వీధిలో ఎంపీటీసీ అడపా సత్తిబాబు కుటుంబం అద్దెకు ఉంటోంది. అతడి ఇంటికి ఎదురుగా ఉన్న ఇంట్లో కొత్తపల్లి సుబ్రహ్మణ్యం (48) కుటుంబం కొన్నేళ్లుగా నివాసం ఉంటోంది. కొత్తపేట పలివెల నుంచి వచ్చిన సుబ్రహ్మణ్యం అమలాపురం, పరిసర ప్రాంతాల్లో చిన్న చిన్న కాంట్రాక్టు పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన భార్యతో అతడికి వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో బుధవారం మధ్యాహ్నం సత్తిబాబు ఎదురింట్లో ఉన్న సుబ్రహ్మణ్యంపై కత్తితో ఒక్కసారిగా దాడి చేశాడు. కత్తిపోట్లకు చెయ్యి అడ్డు పెట్టడంతో రెండు చేతులతో పాటు మెడ వద్ద తీవ్ర గాయాలయ్యాయి. హత్యాయత్నం జరిగిన సమయంలో సుబ్రహ్మణ్యం భార్య దేవాలయానికి వెళ్లింది. అక్కడ పూజాధికాలు పూర్తి చేసుకుని ఇంటికి వచ్చేసరికి రక్తపు మడుగులో పడి ఉన్న భర్తను చూసి వెంటనే స్థానికులతో కలిసి 108 అంబులెన్సు వాహనానికి సమాచారం అందించారు. వాహనం రావడంలో జాప్యం జరగడంతో భర్తను తీసుకుని అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లింది. హత్యాయత్నానికి పాల్పడ్డ సత్తిబాబు తాను వినియోగించిన కత్తితో పట్టణ పోలీసులకు లొంగిపోయినట్టు తెలిసింది. సమాచారం అందుకున్న అమలాపురం డీఎస్పీ ఉమామహేశ్వరరావు, పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. తీవ్రంగా గాయపడ్డ సుబ్రహ్మణ్యం ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

అంజి డెయిరీపై కేసులు

పెద్దాపురం, ఫిబ్రవరి 28: పెద్దాపురం మండలంలోని జి.రాగంపేట గ్రామంలో ఉన్న అంజి డెయిరీలో కల్తీ నెయ్యి తయారు చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా బుధవారం దాడులు చేశారు. రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు అధికారులు ఈ దాడులు నిర్వహించారు. 648 కిలోల పామాయిల్, 216 కిలోల నెయ్యి స్వాధీనం చేసుకున్నారు లీగల్ మెట్రాలజీ అధికారులు మూడు కేసులు నమోదు చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు డెయిరీ యజమాని పిల్లి రవికిరణ్‌కు నోటీసులు జారీ చేశారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

WANTED

★ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనము. జీతం: 20k. Ph: 8977639662, 8977639663 AJH-14152

4 Lines CLASSIFIED Rs.230/- Only

సక్రమంగా ఓటు హక్కు వినియోగించడం

ఓ సామాజిక బాధ్యత

చక్కటి చట్టసభలు ఏర్పడితే జవాబుదారీతనం ఉంటుంది

ప్రజా సంక్షేమానికి తోడ్పడేవారిని ఎన్నుకోవాలి

రాష్ట్ర ఎన్నికల సంఘం విశ్రాంత ప్రధానాధికారి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న నిమ్మగడ్డ రమేశ్‌కుమార్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఓటు హక్కు సక్రమంగా వినియోగించడం ఓ సామాజిక బాధ్యతని రాజ్యాంగం నిర్దేశించిందని విశ్రాంత రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ చెప్పారు. ఓటు హక్కును వినియోగించుకునే అంశంపై ఓటర్లను చైతన్యం చేసే ఉద్దేశంతో సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ ఆధ్వర్యంలో బుధవారం రాజమహేంద్రవరంలో 'కళాజాత'ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచక్షణ, వివేచనతో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎవరైతే ప్రజా సంక్షేమానికి తోడ్పడతారో వారిని ఎన్నికోవడం వల్ల చక్కటి చట్ట సభలు ఏర్పడతాయని.. దాంతో జవాబుదారీతనం ఉంటుందన్నారు. ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీ ల్యాండ్ టైటిల్ యాక్టు తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టం దారుణమైందని, ఇలా ప్రజలకు ఉపయోగపడని చట్టాలకు ప్రజాస్వామ్య వ్యవస్థలో చోటు లేదన్నారు. ఈ చట్టం వల్ల భూమిపై యాజమాన్య హక్కును నిరూపించుకోవడం ఎంతో కష్టసాధ్యమని.. ల్యాండ్ టైటిలింగ్ ఆఫీసర్ కింద పని చేసే వ్యవస్థకు ఇష్టముంటే హక్కు కల్పిస్తుందని లేకపోతే ఆ భూమిపై క్రయవిక్రయాలు ఆగిపోతాయన్నారు. ఇలాంటి విషయాలపై కూలంకషంగా చట్టసభల్లో చర్చ జరిగితే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయన్నారు. రాష్ట్రంలో స్వేచ్ఛగా ఎన్నికలు జరిగే వాతావరణం లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. అధికార పార్టీ ప్రయోజనాల కోసం కింది స్థాయి అధికారులు పని చేయడం వల్లే ఓటర్ల జాబితా లోపభూయిష్టంగా తయారైందన్నారు. గతంలో టీచర్లు ఆ విధులు నిర్వర్తించినపుడు విమర్శలు ఇంత పెద్ద ఎత్తున రాలేదన్నారు. బీఎల్‌వోలుగా పని చేసిన వాళ్లను దూరంగా పెట్టాలని, వలంటీర్ల నీడ కూడా ఎన్నికల ప్రక్రియపై పడడానికి వీల్లేదని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసిందన్నారు. కానీ అవ్వాతాతలను స్వయంగా తీసుకెళ్లి ఓటు వేయించాలని వలంటీర్లకు ముఖ్యమంత్రి చెబుతున్నారని ఇది విస్మయం కలిగిస్తోందన్నారు. ఎన్నికల సంఘాన్ని సైతం ధిక్కరిస్తూ వలంటీర్లకు ఆదేశాలిస్తున్నారని దీనిపై అవసరమైతే న్యాయస్థానాలకు వెళ్లి పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఓ నిశ్శబ్ద విప్లవం ఆంధ్రప్రదేశ్‌లో మొదలైందని.. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా, తమ అభీష్టం మేరకు ఎవరైతే సంక్షేమం, అభివృద్ధి చేస్తారో అలాంటి వారికి ఓటు వేయాలన్నారు. ఓటుని సద్వినియోగం చేసుకోవాలని మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం అన్నారు. ప్రజాస్వామ్యయుత ప్రభుత్వాన్ని తీసుకురావడంలో యువత కీలక భాగస్వామ్యం పోషించాలని పిలుపునిచ్చారు. ఓట్లు అమ్మడం కొనడం వంటివి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం అంటే ప్రజల కోసమనే అర్థం మారిపోయిందన్నారు. ప్రజాస్వామ్యం ఆర్థిక నేరగాళ్ల, భూకబ్జాదారులు, రౌడీలు, గూండాల కోసం అనే కొత్త అర్థాన్ని వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. భావవ్యక్తీకరణ చేసే పాత్రికేయులపై దాడులు చేయడం, వారిపై దేశద్రోహం కేసులు పెట్టడం ప్రజాస్వామ్యం కాబోదని విమర్శించారు. మేధావుల మౌనం సమాజానికి ప్రమాదమని.. మేధావులు, విద్యావంతులు మేల్కోవాలని కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న విధ్వంసాన్ని కళ్లారా చూస్తూ కూడా కళ్లు లేని కబోదుల్లాగా మేధావులు ఉంటే వాళ్లు ఈ సమాజానికి అన్యాయం చేసినట్లేనని.. అందువల్ల నియంతృత్వ పాలనను తరిమికొట్టడానికి వారంతా కలిసి రావాలని కోరారు. ముఖ్యంగా విద్యావంతులు, మధ్య తరగతి వారు ఓటు హక్కును ఉపయోగించుకోకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. తొలుత ఓటు ప్రాముఖ్యంపై నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అశోక్ కుమార్ జైన్, కంటిపూడి సర్వారాయుడు, కృష్ణకుమార్ తదితరులు వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు.



ఓటు హక్కు ప్రాముఖ్యంపై గేయాలాపన

ఘనంగా మహాకాళేశ్వరుడి కల్యాణం

ఇర్రిపాకలో కొనసాగుతున్న పూజా కార్యక్రమాలు



ప్రవచనాలు అందిస్తున్న స్వామీజీ

జగ్గంపేట, ఫిబ్రవరి 28: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలో జ్యోతుల నెహ్రూ కుటుంబం ఆధ్వర్యంలో జరుగుతున్న కోటి పార్థివ మహా రుద్రాభిషేకంలో భాగంగా బుధవారం విఘ్నేశ్వర పూజ, పరిషత్ పంచగవ్య ప్రాసన, గోపూజ, మహాన్యాసము, రుద్రాభిషేకము, బిల్వార్చన, కుంకుమార్చన, నారాయణ ఆవాహనం నిర్వహించారు. జ్యోతుల నెహ్రూ, మణి, జ్యోతుల నవీన్, లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు సునీత దంపతులు పీటలపై కూర్చుని మహా కాళేశ్వరుడు వారి కల్యాణం జరిపించారు. ద్వాదశ జ్యోతిర్లింగాలకు పంచామృత అభిషేకం, నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుంటూరు శ్రీ సదనం పీఠాధిపతి శ్రీ పర శివానంద భారతి స్వామీజీ, అఖిల భారత విశ్వ హిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు, శ్రీ చక్రపీఠం పీఠాధిపతులు శ్రీ వై లోకనాథ్‌శర్మ హాజరై మహా రుద్రాభిషేకంలో పాల్గొన్నారు. భక్తులు తరలివచ్చి స్వామి వారిని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

5 నుంచి విద్యుదుత్పత్తి పునఃప్రారంభం



సీఈ శ్రీధర్

మోతుగూడెం, ఫిబ్రవరి 28: సీలేరు కాంప్లెక్సులో మార్చి 5 నుంచి విద్యుత్ ఉత్పత్తి పునఃప్రారంభించడానికి చర్యలు చేపడుతున్నామని సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్ తెలిపారు. స్థానిక విలేఖరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం లేకుండా, గోదావరి డెల్టాకు రబీ పంటలకు నీటి విడుదల నేపథ్యంలో సీలేరు కాంప్లెక్సులో ఈ నెల 10నుంచి విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశామన్నారు. అయితే ప్రస్తుతం పోలవరంలో నీటి నిల్వలు తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో వచ్చే నెల 5వ తేదీ నుంచి నీరు విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు విన్నపం మేరకు సీలేరు కాంప్లెక్సులో విద్యుత్ ఉత్పత్తి అనంతరం నీటిని గోదావరి డెల్టాకు విడుదల చేయాలని జెన్‌కో ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని చెప్పారు. ఈ మేరకు పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి అనంతరం నాలుగు వేల క్యూసెక్కుల నీరు విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం బలిమెలలో ఏపీ వాటాగా 19.15 టీఎంసీలు, సీలేరు, డొంకరాయి జలాశయాల్లో 13.40 టీఎంసీల నీటి నిల్వలతో మొత్తం 32.55 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయన్నారు. ఈ నీటితోనే రాబోయే మూడు నెలలు (వేసవిలో) నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ కాంప్లెక్సు పరిధిలోని సీలేరు, డొంకరాయి, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాలకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని ఆయన వెల్లడించారు.

వైసీపీలోకి గొల్లపల్లి సూర్యారావు



రాజోలు, ఫిబ్రవరి 28: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు తాడేపల్లిలోని సీఎం కార్యాలయానికి వెళ్లి సీఎం జగన్ సమక్షంలో బుధవారం వైసీపీలో చేరారు. రాజోలు ఎమ్మెల్యే టికెట్‌ను జనసేనకు కేటాయించడంతో ఆయన అసంతృప్తికి గురయ్యారు. టీడీపీకి, టీడీపీ రాజోలు ఇన్‌చార్జి పదవికి రాజీనామా చేసిన లేఖను ఫ్యాక్స్ ద్వారా టీడీపీ కార్యాలయానికి గొల్లపల్లి పంపారు. వైసీపీ రాజోలు టికెట్‌ను గొల్లపల్లి ఆశిస్తున్నారు. రాజోలు నియోజకవర్గంలో 2014 నుంచి 2019 వరకు ఎమ్మెల్యేగా పనిచేశారు. 2019 నుంచి ఇప్పటివరకు రాజోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా పని చేశారు. మాజీ మంత్రి గొల్లపల్లితో పాటు ఆయన కుమారుడు గొల్లపల్లి శ్రీధర్, కొల్లాబత్తుల కుమార్, పితాని సూరిబాబు, చిట్టూరి సంతోష్ వైసీపీలో చేరారు.

గంజాయి పంట దహనం



గంజాయి పంటను దహనం చేస్తున్న పోలీసులు

మోతుగూడెం, ఫిబ్రవరి 28: డొంకరాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో మెట్టగూడెం కొండల్లో సాగు చేస్తున్న గంజాయిని బుధవారం పోలీసులు దహనం చేశారు. గంజాయి సాగు చేస్తున్నారని డొంకరాయి ఎస్ఐ శివకుమార్‌కు వచ్చిన సమాచారంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వై.రామవరం డిప్యూటీ తహసీల్దార్ కె.సుధాకరరావు, వీఆర్వో సందీపాచార్యుల సమక్షంలో మెట్టగూడెం కొండల్లో గంజాయి సాగు చేస్తున్న వంతల జైసన్, బురిడి సహదేవ్, కొర్రా సోనియా, పాంగి నాగేశ్వరరావు, కిలో నగేష్, వీరి అప్పారావులపై మెరుపు దాడి చేసి అరెస్ట్ చేశారు. అనంతరం 1.5 ఎకరాల ఫారెస్ట్ లాండ్‌లో సాగు చేస్తున్న సుమారు రూ.2.75 లక్షల విలువ చేసే 550 గంజాయి మొక్కలను నరికేసి కాల్చి బూడిద చేశారు. అనంతరం ఆరుగురు నిందితులను డొంకరాయి ఎస్ఐ శివకుమార్ రిమాండ్ నిమిత్తం రంపచోడవరం జూనియర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 28: వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును ఇద్దరు దొంగిలించుకుపోయారు. ముమ్మిడివరం నగర పంచాయతీ బందరుపాలానికి చెందిన కోళ్ల సత్యవతి కొత్తలంకలో జరిగే వివాహానికి వెళ్లేందుకు ఆటో కోసం ఎదురుచూస్తుండగా ఇద్దరు యువకులు మోటారుసైకిల్‌పై వచ్చి వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లో ఉన్న వ్యక్తులు తెలుసా అని అడిగారు. ఆమె తెలియదని చెప్పడంతో వారు కొంచెం ముందుకు వెళ్లి మళ్లీ వెనక్కివచ్చి ఆమె మెడలోని 2 కాసుల బంగారు గొలుసును తెంపుకుపోయారు. ఆమె పోలీసులను ఆశ్రయించగా ఎస్ఐ డి.సురేష్‌బాబు అగంతకుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

వాడపాలెంలో బండారు పూజలు

కొత్తపేట, ఫిబ్రవరి 28: వాడపాలెం శివారు మారెమ్మమాన్యంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీగణపతిస్వామి ఆలయంలో బుధవారం జరిగిన విగ్రహ ప్రతిష్ఠలో టీడీపీ-జనసేన కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి బండారు సత్యానందరావు పార్టీశ్రేణులతో కలిసిపాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన్ను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. సర్పంచ్ త్సామా బాబు, బండారు బుల్లితాత, బండారు రాజేష్, కడియం భాస్కర్, పోలిశెట్టి రాంబాబు, పప్పుల బుజ్జి, చీకట్ల అబ్బు పాల్గొన్నారు.

● తాడేపల్లిగూడెంలో జరిగిన టీడీపీ, జనసేన సభకు కార్లు, మోటార్‌సైకిళ్లతో ర్యాలీగా తరలిన ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

టీడీపీ, జనసేన సభకు తరలిన నాయకులు, కార్యకర్తలు






అమలాపురం: డీఎంఆర్ శేఖర్ ఆధ్వర్యంలో తరలివెళుతున్న జనసైనికులు, ముమ్మిడివరం: కాన్వాయ్‌కు జెండా ఊపుతున్న దాట్ల బుచ్చిబాబు, రావులపాలెం: గోపాలపురం నుంచి వెళ్తున్న టీడీపీ, జనసేన నాయకులతో బండారు, మండపేట: జెండా ఊపుతున్న వేగుళ్ల జోగేశ్వరరావు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

టీడీపీ-జనసేన ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలో జరిగిన జెండా బహిరంగ సభకు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి జనసేన, టీడీపీలకు చెందిన వేలాది మంది కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివెళ్లారు. ద్విచక్ర వాహనాలు, టెంపోలు, ప్రైవేటు బస్సుల్లో వెళ్లారు. అమలాపురం నుంచి జనసేన లోక్‌సభ ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో నాయకులు భారీ ఊరేగింపుగా వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే, అమలాపురం అసెంబ్లీ టీడీపీ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు, జనసేన ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఇరు పార్టీల నేతలు కోనసీమ ముఖ ద్వారమైన రావులపాలెం మీదుగా వేలాది వాహనాల్లో తరలివెళ్లడంతో కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది.

ముమ్మిడివరం: తాడేపల్లిలో బుధవారం సాయంత్రం జరిగిన బహిరంగ సభకు ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, తాళ్లరేవు మండలాలకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ముమ్మిడివరం టీడీపీ కార్యాలయానికి చేరుకుని అక్కడి నుంచి తరలివెళ్లారు. నియోజకవర్గ ఇన్‌చార్జి దాట్ల బుచ్చిబాబు జెండా ఊపగా కార్లు, బస్సులు, మోటారు సైకిళ్లపై భారీ ఎత్తున ర్యాలీగా తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, నాగిడి నాగేశ్వరరావు, దాట్ల పృథ్విరాజ్, చిక్కాల అంజిబాబు, అర్థాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణకుమార్, పొద్దోకు నారాయణరావు, సాగిరాజు సూరిబాబురాజు, అడబాల సతీష్, గొల్లపల్లి గోపి, యాళ్ల ఉదయ్, కురసాల శివబాబు తదితరులు తరలివెళ్లినవారిలో ఉన్నారు.

మలికిపురం: తాడేపల్లిగూడెం తెలుగు విజయకేతన బహిరంగ సభకు రాజోలు నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన పార్టీల నాయకులు బుధవారం భారీగా తరలివెళ్లారు. నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు, టీడీపీ మొబలైజేషన్ పరిశీలకుడు కడలి గోపి, జనసేన ఇన్‌చార్జి గుండుబోగుల పెద్దకాపు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి పంపడమే లక్ష్యమన్నారు. దేవ వరప్రసాద్, మంగెన భూదేవి, మేడిచర్ల సత్యవాణి, బందెల పద్మ, చాగంటి స్వామి, ముప్పర్తి నాని, గుబ్బల శ్రీనివాస్, తాడి సత్యనారాయణ, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, తాడి మోహన్, సాగి పాపయ్యరాజు, బోనం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మండపేట: తాడేపల్లిగూడెంలో టీడీపీ,జనసేన సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన భారీ సభకు మండపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు తరలివెళ్లారు.

ఉప్పలగుప్తం: టీడీపీ- జనసేన తాడేపల్లిగూడెం సభకు టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు అరిగెల నానాజీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు బస్సులు, చిన్నకార్లలో తరలివెళ్లారు. టీడీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు మండలంలో పర్యటించి పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు. మాజీ జడ్పీటీసీ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, లంకే భీమరాజు, మద్దింశెట్టి సీతారామస్వామి, గుంటు ఫణిప్రసాద్, ఆకేటి పెద్ద, అడపా అవినాష్, ఈదరపల్లి శ్రీనివాసరాజు, కె.పెద్దిరాజు తదితరులు తమ అనుయాయులతో తరలి వెళ్లారు.

ద్రాక్షారామ: టీడీపీ, జనసేన ఉమ్మడిగా తాడేపల్లిగూడెంలో నిర్వహించిన జనజయకేతనం జెండా సభకు రామచంద్రపురం నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన శ్రేణులు తరలివెళ్లారు. చోడవరం బైపాస్ రోడ్డులో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకుడు డా. కాదా వెంకటరమణలు తాడేపల్లిగూడెం తరలివెళ్లే వాహన శ్రేణికి జెండా ఊపి ప్రారంభించారు. బస్సులు, కార్లలో టీడీపీ, జనసేన శ్రేణులు సభకు తరలివెళ్లారు.

పి.గన్నవరం: రాబోయే సార్వత్రిక ఎన్నికలు అత్యంత కీలకమని, టీడీపీ-జనసేన ఉమ్మడి పోరుతో వైసీపీ పతనం ఖాయమని జనసేన నియోజకవర్గ కన్వీనర్ గిడ్డి సత్యనారాయణ విమర్శించారు. పి.గన్నవరంలో జెండా ఊపి వాహనాల ర్యాలీని ప్రారంభించారు. నియోజకవర్గం నాలుగు మండలాలు నుంచి 37కార్లలో జనసైనికులు తాడేపల్లిగూడెం బహిరంగసభకు తరలివెళ్లినట్లు చెప్పారు. ఆయనతో పాటు జనసేన ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వాసంశెట్టి కుమార్, జనసేన మండల అధ్యక్షుడు సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, జాలెం శ్రీనివాసరాజా, దొమ్మేటి సాయికృష్ణ, కోటరాజేంద్ర, తాటికాయల శ్రీనివాసరావు, తుండిరి బుజ్జి, యడ్ల ఏసుభాస్కర రావు, షేక్ దొరబాబు, తాటికాయల వెంకటేష్, బి.సతీష్ ఉన్నారు.

రామచంద్రపురం: తాడేపల్లిగూడెం సభకు జనసేన నాయకుడు చిక్కాల దొరబాబు ఆధ్వర్యంలో పట్టణం నుంచి 105కార్లలో నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా తరలివెళ్లారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం, పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్ సంయుక్త ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి అధిక సంఖ్యలో కార్లలో నాయకులు, కార్యకర్తలు తెలుగు జనవిజయకేతనం జెండా సభకు తరలివెళ్లారు. పట్టణమంతా జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తల నినాదాలతో హోరెత్తింది.

ఆత్రేయపురం: తాడేపల్లిగూడెం సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి టీడీపీ, జనసేన శ్రేణులు తాడేపల్లిగూడెంలో నిర్వహించిన సభకు తరలివెళ్లారు. వివిధ గ్రామాల నుంచి ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు, కార్లు, బైక్లు, వ్యాన్లల్లో పార్టీ జెండాలను చేతబూని వెళ్లారు.

రావులపాలెం: తాడేపల్లిగూడెంలో జరిగిన జెండా సభకు మండలం నుంచి టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో తరలి వెళ్లారు. గోపాలపురం వశిష్ఠ వంతెన సమీపంలో పార్టీ శ్రేణులతో కొత్తపేట ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు మాట్లాడారు.

ఆలయ షెడ్డుకు చేరుకున్న రథం

అంతర్వేది, ఫిబ్రవరి 28: మాఘమాసంలో పది రోజుల పాటు అత్యంత వైభంగా జరిగిన లక్ష్మీనరసింహస్వామివారి ఉత్సవాలు అనంతరం స్వామివారి రథాన్ని బుధవారం ఆలయానికి చేర్చారు. కల్యాణం మరుసటిరోజు రాజవారి వీధిలో బయలుదేరిన రథం స్వామివారి సోదరి అశ్వరూడాంబికకు చీర, సారె అందించి అనంతరం 16 స్తంభాల మండపం వద్దకు చేరుకుంది. ఉత్సవాలు ముగిసిన కొన్ని రోజులకు రథాన్ని ఆలయం వద్దనున్న షెడ్డుకు చేర్చినట్టు ఏసీ వి.సత్యనారాయణ తెలిపారు.

నామనకు పలువురి పరామర్శ

మామిడికుదురు, ఫిబ్రవరి 28: భార్యా వియోగంతో బాధపడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబును బుధవారం పలువురు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాంబాబు సతీమణి కృష్ణవేణి చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ కుసుమ వనజాకుమారి, మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, తెలుగురైతు అధ్యక్షుడు మట్టా మహాలక్ష్మిప్రభాకర్, వేగిరౌతు ప్రమీల, మద్దాల కృష్ణకుమారి తదితరులు ఉన్నారు.

శ్రీసిద్ధివినాయక ఆలయంలో బండారు పూజలు

అయినవిల్లి, ఫిబ్రవరి 28: అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామిని టీడీపీ-జనసేన కొత్తపేట నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అర్చకులు బండారుకు వేద ఆశీర్వచనం చేసి, శేష వస్త్రంతో సత్కరించారు.

టీడీపీ నేత చోడపనీడి బాబు మృతి



కొత్తపేట, ఫిబ్రవరి 28: కొత్తపేటకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మందపల్లి శనేశ్వర స్వామి పాలకమండలి మాజీ సభ్యుడు చోడపనీడి బాబు(52) బుధవారం మృతిచెందారు. టీడీపీకొత్తపేట అసెంబ్లీ అభ్యర్థి బండారు సత్యానందరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ బండారు వెంకటసత్తిబాబు, సర్పంచ్ బూసి జయలక్ష్మిభాస్కరరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి, టీడీపీ నాయకులు బాబు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

జాతీయ సైన్స్ దినోత్సవం



అమలాపురం: ఆల్కహాల్ డిటెక్టర్‌ను కనిపెట్టిన జీవీసీ విద్యార్థులు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 28: జన విజ్ఞాన వేదిక 37వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అమలాపురం యూటీఎఫ్ హోం వద్ద బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. జేవీవీ పతాకాన్ని జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఇఆర్ సుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. జిల్లా కోశాధికారి త్రినాథ్, సీనియర్ నాయకులు డి.శ్రీరామమూర్తి, బీఎస్ వెంకటేశ్వరరావు, డి.నాగేంద్రరాజు, వి.అర్జునరావు తదితరులు పాల్గొన్నారు. భట్లపాలెం బీవీసీ క్యాంపస్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. అధ్యాపకుల సహకారంతో విద్యార్థులు 12 వినూత్న ప్రాజెక్టులు రూపొందించగా హౌస్ ఆటోమేషన్ యాప్ డెవలెప్‌మెంట్ ప్రాజెక్టు మొదటి బహుమతి దక్కించుకుంది. ఈప్రాజెక్టును సీహెచ్ శ్రీహరి, జైపాల్, తారక్ రూపొందించారు. రహదారి ప్రమాదాలు ఎక్కువవుతున్న ఈ రోజుల్లో వాటిని అరికట్టేందుకు ఆల్కాహాల్ డిటెక్టర్‌ను విద్యార్థి వి.జశ్వంత్ తయారు చేశాడు. వినూత్న ప్రాజెక్టు రూపొందించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

ముమ్మిడివరం: జాతీయ సైన్స్ దినోత్సవం, జనవిజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవాన్ని ముమ్మిడివరంలో నిర్వహించారు. బళ్లగేటు సెంటర్‌లో జనవిజ్ఞాన వేదిక పతాకాన్ని రెడ్డి వీరాస్వామి ఆవిష్కరించి మాట్లాడారు. జనవిజ్ఞానవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు జనిపల్లి సత్యనారాయణ, కోలా వెంకటేశ్వరరావు, బీఎల్‌బీ సుబ్రహ్మణ్యం, ఎంవీ రాంబాబు, శీలారపు శ్రీనివాసరావు, యు.దశరథరామయ్య, కేవీఎస్ నారాయణ, జి.దుర్గాప్రసాద్, ఆర్‌బీవీ రమణ, బీర కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మలికిపురం: విశ్వేశ్వరాయపురం వివేకానంద పాఠశాల వద్ద జనవిజ్ఞాన వేదిక జెండాను ఆవిష్కరించారు. బి.రాంప్రసాద్, మండల జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడారు. సీహెచ్ తులసీరావు, బోనం రాజు, నక్కా రమేష్, ఎన్.సంగీతరావు పాల్గొన్నారు. పరిరక్షణ, ప్లాస్టిక్ వాడకం నిషేధం, సైన్స్‌తోనే ప్రగతి, మూఢనమ్మకాలు విడనాడాలి అనే నినాదాలతో ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు.

మండపేట: మానవ జీవితానికి సైన్స్‌కు విడదీయరాని బంధం ఉందని పలువురు వక్తలు అన్నారు. మండపేట పట్టణం, మండలంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం సైన్స్‌డేను నిర్వహించారు. విద్యార్థులు తయారుచేసిన పలు రకాలు సైన్స్‌ప్రయోగాలతో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. విజేతలకు బహుమతులు అందజేశారు.

ఆలమూరు: స్థానికశ్రీసిద్ధార్థ హైస్కూల్లో సైన్స్ ప్రదర్శనను డైరెక్టర్ కె.ముల్లారావు ప్రారంభించగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. సైన్స్ మేధావి సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

ద్రాక్షారామ: అంబికపల్లి అగ్రహారం కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సైన్సు దినోత్సవాన్ని నిర్వహించారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రంగారావు, ఏవో ఏఎన్‌వి రవిధర్, ప్లేస్‌మెంట్ అధికారి, హెచ్‌వోడీ ఎంఆర్‌ఎస్‌ఏ కృష్ణ మాట్లాడుతూ సీవీ రామన్ ఎఫెక్ట్ గురించి వివరించారు. అకడమిక్ పరంగా ప్రతిభచూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

రాజోలు: తాటిపాక భాష్యం పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులతో సైన్స్ ఎక్స్‌పో ఏర్పాటుచేశారు. జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్, ప్రిన్సిపాల్స్ రంగబాబు, నీలవేణి పాల్గొన్నారు.

కాట్రేనికోన: సాపేవారిపల్లె హైస్కూల్ హెచ్‌ఎం ఆర్.రమేష్‌నాయుడు పర్యవేక్షణలో విద్యార్థులు పరిసరాల్లో పనికిరాని వస్తువులతో లోకాస్ట్-నోకాస్ట్ పరికరాలు తయారుచేసి అందరినీ ఆలోచింపజేశారు. విద్యార్థులకు ప్రోత్సాహకబహుమతులు అందించారు. ఉపాధ్యాయులు ఎస్ఎస్ సత్యనారాయణ, ఎస్‌బీఎస్ఎస్‌మూర్తి, ఎం.శ్రీనివాసరాజు, ఎస్వీమీనాక్షి, జేడీ శ్యామల, గెడ్డం ప్రదీప్, ఎ.ప్రసాద్, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పి.గన్నవరం: పి.గన్నవరం హైస్కూల్‌లో సైన్స్‌డేను నిర్వహించారు. విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులు విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ అంశాలకు సంబంధించి తయారు చేసిన ప్రాజెక్టులపై ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సాయితేజ పబ్లిక్ స్కూల్లో వివిధ అంశాలకు సంబంధించి విద్యార్థులు ప్రాజెక్ట్ ప్రదర్శించారు.

మామిడికుదురు: మామిడికుదురు హైస్కూలులో మండలస్థాయిలో వివిధ రకాల పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రవాహాసంద్రుడు నయినాల శ్రీనివాస్ రూ.21వేలు విలువైన బహుమతులను అందించారు. సైన్స్ విశిష్టతను బయాలజీ ఉపాధ్యాయుడు సైన్స్ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. మామిడికుదురు దీప్తి స్కూలులో విద్యార్థులు తయారుచేసిన సైన్స్ ప్రదర్శనలను జడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు పరిశీలించి అభినందనలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈవో లక్ష్మీనారాయణ, హెచ్ఎం సీహెచ్ నిరంజని, పీఎంసీ కమిటీ చైర్మన్ ఎం.వెంకటేష్, నయినాల తమ్మారావు పాల్గొన్నారు.

రాయవరం: రాయవరం భాష్యం స్కూల్‌లో బుధవారం విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ పట్నాల శ్రీనివాసగుప్తా మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ ప్రయోగాలు ఉపకరిస్తాయన్నారు. సీవీరామన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు విద్యార్థులు పలు సైన్స్ ప్రయోగాలను ప్రదర్శించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రైమరీ ప్రిన్సిపాల్ ఎం.కాంచన, అధ్యాపకుడు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

యానాం: యానాం జవహర్ నవోదయ విద్యాలయంలో సైన్స్ డే వేడుకలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు సివిరామన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. యానాంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సైన్స్‌డే వేడుకలను నిర్వహించారు. స్థానిక నల్లం రెసిడెన్షియల్ కాన్సెప్ట్ పాఠశాలలో విద్యా సంస్థల చైర్మన్ నల్లం నాగాబాబు ఆధ్వర్యంలో సైన్స్‌డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకుట్టుకున్నాయి. స్థానికి రిజెన్సీ పాఠశాలలో, శ్రీచైతన్య పాఠశాలలో వేడుకలు నిర్వహించారు.

అంబాజీపేట: శాస్త్రవేత్త సర్ సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని హెచ్ఎంలు కడలి సాయిరామ్, వీవీ కేశవాచార్యు అన్నారు. పలు హైస్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శనలు చేశారు. తొండవరం జడ్పీ హైస్కూల్‌లో శాస్త్ర వేత్తల వేషాధారణలతో విద్యార్థులు అలరించారు. ఈసందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకుబహుమతులు అందించారు.

కపిలేశ్వరపురం: మాచర ఉన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎంరమాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈవో కె.తాతారావు, ప్రొఫెసర్ గొడవర్తి భాగవన్నారయణ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులు, ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అలూమిని సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామచంద్రపురం: మోడరన్ గర్ల్స్ హైస్కూల్ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. సైన్స్ ఉపాధ్యాయుడు పి.వసంత కుమార్ సైన్స్ దినోత్సవ ప్రాముఖ్యం వివరించారు. జీవితానికి మార్గదర్శకంగా నిలిచి మనల్ని ప్రగతి పథంలో నడిపించేది సైన్స్ అని మోడరన్ అధినేత జి.వి.రావు అన్నారు.

కొత్తపేట: స్థానిక సిద్ధార్థ, ప్రియదర్శిని, క్రాంతి భారతి పాఠశాలల్లో విద్యార్థులు పలు రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఆయా స్కూల్స్ కరస్పాండెంట్లు ఏవీవీ సత్యనారాయణ, ఏబీసీ దేవ్, బి.సత్యవాణి, డైరక్టర్ పి.నారాయణరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రావులపాలెం: స్థానిక శ్రీచైతన్య టెక్నో స్కూలులో సైన్సు ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందజేశారు. కొవ్వూరి వెంకట శ్రీనివాస్, కృష్ణారెడ్డి, ఐ.నరేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కోటి రాజుకు నివాళి

ద్రాక్షారామ, ఫిబ్రవరి 28: కోటి రాజు మృతికి ప్రజా సంఘాలు సంతాపం తెలిపాయి. బుధవారం వెంకటాయపాలెంలో రాజు నివాసం వద్ద సంతాప సభ నిర్వహించారు. వెంకటాయపాలెంలో 1997లో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో కోటిరాజు సాక్షిగా ఉన్నారన్నారు. రాజు చిత్రపటానికి నివాళులర్పించారు. ఆర్పీఐ నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, రైతు కూలీ సంఘం నాయకుడు చీకట్ల వెంకటేశ్వరరావు, సీఐటీయూ నాయకుడు బలరామ్, న్యాయవాది నీలం మధుసూదనరావు, పీడీఎస్‌యూ నాయకులు బి.సిద్ధూ పాల్గొన్నారు.

హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ప్రారంభం

కె.గంగవరం, ఫిబ్రవరి 28: అముజూరులో బుధవారం సూర్య హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీని బుధవారం ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ ప్రారంభించారు. గ్యాస్‌ను కంపెనీ వారి ధరకే సరఫరా చేస్తామని రవాణా చార్జీలు వసూలు చేయమని నిర్వాహకుడు మేడిశెట్టి శ్రీనివాస్ చెప్పారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు. పాణింగపల్లిలో రూ. 2.50లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎంపీ ప్రారంభించారు.

పెన్షన్ విధానం మార్చాలని ఉద్యోగుల ప్రదర్శన

యానాం, ఫిబ్రవరి 28: కేంద్రం అమలులోకి తెచ్చిన నూతన పెన్షన్ విధానాన్ని మార్చాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు ప్రదర్శన నిర్వహించారు. బుధవారం యానాం ప్రభుత్వ ఉద్యోగుల సంఘాల సమాఖ్య అధ్య క్షుడు చెల్లి గోపినాద్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ప్రదర్శనగా వెళ్లి పరిపాలనాధికారి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

అంతర్వేది, ఫిబ్రవరి 28: సఖినేటిపల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉపాధి హామీ పథకానికి సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గ్రామాల్లో జరిగిన పనులపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బడుగు మంగాదేవి, సామాజిక తనిఖీ బృందం ఏపీవో నాగప్రసాద్ పాల్గొన్నారు.

18 ఏళ్లుగా పనిచేస్తున్నా పెరగని జీతాలు
సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 28: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జేఏసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం జిల్లా శాఖ నాయకుల బృందం డ్వామా పీడీ ఎస్.మధుసూదన్‌ను కలిసి వినతిపత్రం అందజేసింది. తమ డిమాండ్లను వారంలో పరిష్కరించాలని, లేని పక్షంలో సమ్మెబాట తప్ప వేరే గత్యంతరం లేదని లేఖలో పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో పనిచేస్తున్న ఉపాధి హామీ సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లకు గ్రేడ్ ఫిక్స్ చేయకపోవడంతో తీవ్ర అన్యాయం జరిగిందని జేఏసీనాయకులు ఎం.త్రినాథ్, పి.నాగబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు జె.సురేష్‌కుమార్ డి.నాగేంద్ర, వై.శ్రీనివాస్, టి.సురేష్, కె.అనూష, పి.రజిత్‌సింగ్, ఆర్.శైలజ పాల్గొన్నారు.

నూతన ఆలయ ప్రతిష్ఠా మహోత్సవ పూజలు

మామిడికుదురు, ఫిబ్రవరి 28: మామిడికుదురులో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీగణపతి ఆలయ విగ్రహ, శిఖర ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా బుధవారం పలు పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. గ్రామానికి చెందిన విశ్రాంత అధికారి వాసంశెట్టి సత్యనారాయణమూర్తి నిర్మించిన ఆలయంలో సామూహిక లక్ష్మీగణపతి పూజ, కుంకుమ పూజ, హోమం, క్షీరాదివాసం, పంచ సయ్యాదివాసం, ధాన్యదివాసం, విశేష పూజ, నీరాజనం, వేదస్వస్తి తదితర పూజలు ఘనంగా జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గురువారం ఉదయం నూతన ఆలయంలో విగ్రహ శిఖర ప్రతిష్ఠా కార్యక్రమం జరుగుతుందని కమిటీవారు తెలిపారు.

శ్రీపట్టాభిరామస్వామి ఆలయ వార్షికోత్సవం

అంబాజీపేట, ఫిబ్రవరి 28: మాచవరం నందెపువారిపాలెంలో ఉన్న శ్రీపట్టాభిరామస్వామి ఆలయ 16వవార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

వైభవంగా సంకటహర చతుర్థి పూజలు

ఆలమూరు, ఫిబ్రవరి28: సంకటహర చతుర్థి సందర్భంగా మండలంలోని పలు వినాయక ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. పెదపళ్ల బాలగణపతి ఆలయంలో మహిళలు స్వామివారిని దర్శించుకున్నారు.

వరసిద్ధి వినాయకుని విగ్రహ ప్రతిష్ఠ

కె.గంగవరం, ఫిబ్రవరి 28: పాణింగపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో బుధవారం వరసిద్ధి వినాయకుని విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన వాసంశెట్టి శ్రీనివాస్ ఆదిలక్ష్మి దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు చేశారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, సర్పంచ్ చీకట్ల సునీత గోపాలం, వైస్ ఎంపీపీ నీతిపూడి మధుబాల వెంకట్రావు, సొసైటీ అధ్యక్షుడు వైట్ల అచ్యుతరామ్ ప్రసాద్, అధిక సంఖ్యలో ప్రజలు స్వామివారిని దర్శించుకున్నారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు.

వలంటీర్లకు పురస్కారాలు

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 28: వలంటీర్ల సేవలు మరువలేనివని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. బుధవారం అంగరలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వలంటీర్లకు పురస్కారాలు అందించారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, నక్కా సింహాచలం, సిరిపురపు శ్రీనివాసరావు, శీలం గోవిందు, గ్రామసర్పంచ్ వాసా కోటేశ్వరరావు, పలివెల మధు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సత్యం మాస్టారు బృందం డ్యాన్స్ ప్రోగ్రాం

ముమ్మిడివరం, ఫిబ్రవరి28: సీహెచ్ గున్నేపల్లిలోని సత్తెమ్మతల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈనెల24న ప్రారంభమైన అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా పలు ఆధ్యాత్మిక ప్రవచనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం రాత్రి హైదరాబాద్ సత్యం మాస్టారు బృందం డ్యాన్సు ప్రోగ్రాం, ఫరీఫ్ మిమిక్రీ పలువురిని ఆకట్టుకుంది. బుధవారం రాత్రి కూడా ఆ బృందం నిర్వహించిన డ్యాన్స్ ప్రోగ్రాం ప్రేక్షకులను అలరించింది.

సాదాసీదాగా మున్సిపల్ సమావేశం

మండపేట, ఫిబ్రవరి 28 మండపేట మున్సిపల్ సాధారణ సమావేశం బుధవారం చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి అధ్యక్షతన జరిగింది. వైసీపీ కౌన్సిలర్లు, ముగ్గురు టీడీపీ కౌన్సిలర్లు హాజరయ్యారు. ఎమ్మెల్యే వేగుళ్ల, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పలువురు టీడీపీ కౌన్సిలర్లు హాజరుకాలేదు. సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే అజెండాలో అంశాలను ఆమోదించి సమావేశాన్ని ముగించేశారు. పట్టణంలో 25ఏళ్ల నుంచి రైస్‌మిల్లుల నుంచి వస్తున్న నల్ల బూడిద వల్ల కలిగే నష్టం గురించి కోఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధా కృష్ణ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఏడిదరోడ్డులో వున్న రైస్‌మిల్లుల నుంచి వస్తున్న కాలుష్యం నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆయన, సభ్యులు కోరారు. పట్టణంలో ఉన్న హోటల్స్, రెస్టారెంట్లపై ఫుడ్ఇన్‌స్పెక్టర్‌తో తనిఖీలు నిర్వహించాలని సభ్యులు కోరారు. పట్టణంలో కుక్కలు బెడద ఉందని, చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. కమిషనర్ బి.రాము, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైసీపీకి రాజబాబు రాజీనామా



ముమ్మిడివరం, ఫిబ్రవరి 28: ముమ్మిడివరానికి చెందిన వైసీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి వేగిరౌతు వెంకటరాజు(రాజబాబు) బుధవారం పార్టీకి, తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పార్టీ జిల్లా అధ్యక్షుడికి బుధవారం పంపించారు. వాటి నకళ్లను ముమ్మిడివరంలో పత్రికలకు విడుదల చేశారు. ఎమ్మెల్యే సతీష్‌కుమార్ నిరంకుశ ధోరణి, అనాలోచిత నిర్ణయాలతో నియోజకవర్గ అభివృద్ధికి విఘాతంగా మారడంతో నియోజకవర్గంలో ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు ఇబ్బందులు పడుతున్నారని, తాను ప్రజలకు ఇచ్చిన హామీలు, ఆశించిన సేవలు పార్టీలో ఉండి చేయలేకపోయానని, ప్రజాసేవ చేయలనే దృఢ సంకల్పంతో తాను ఈనిర్ణయం తీసుకున్నానన్నారు. త్వరలో స్నేహితులు, అభిమానులతో చర్చించి భవిష్యత్ నిర్ణయం తీసుకుంటానన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించిన డీఎస్పీ

అల్లవరం, ఫిబ్రవరి 28: అమలాపురం డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎం.మహేశ్వరరావు బుధవారం అల్లవరం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్న దృష్ట్యా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

వెంకన్న ఆలయంలో మాజీ మంత్రి గంటా పూజలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 28:వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా విచ్చేశారు. కుటుంబీకులు ఏడువారాల ప్రదక్షిణనోమును నిర్వహించుకుని అష్టోత్తర పూజలు చేశారు. గంటా వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. స్వామివారి చిత్రపటం అందజేశారు. గంటాను టీడీపీ మండల అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, లొల్ల సర్పంచ్ కాయల జగన్నాథం మర్యాదపూర్వకంగా కలిశారు.

చినకోరుమిల్లిలో గడపగడపకు..

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి28: చినకోరుమిల్లిలో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఇంటింటా తిరిగి ప్రజలసమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే

రాజోలు, ఫిబ్రవరి 28: టైలర్స్ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గుబ్బల కుమార్ అధ్యక్షతన రాజోలులో జరిగిన టైలర్స్‌డే వేడుకలో విలియంహో విగ్రహానికి కామన సత్యనారాయణ నివాళులర్పించారు. సీనియర్ టైలర్లు మోకా ప్రసాద్, ఎం.త్రినాథ్‌లను సంఘ సభ్యులు సత్కరించి నగదు అందించారు. టైలర్స్ భవనం స్థలదాత కామన లక్ష్మణరావు జ్ఞాపకార్థం రాజోలు ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలుఅందించారు. సంఘ సభ్యులు పెచ్చెట్టి శ్రీధర్, గొల్లమందల విజయ్, మామిడిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నానరు.

ఉప్పలగుప్తం: గొల్లవిల్లిలో శ్రీసాయిలక్ష్మీగణపతి టైలర్స్ సహకార సంఘం ఆధ్వర్యంలో విలియంహో చిత్రపటానికి నివాళులర్పించారు. సంఘ అధ్యక్షుడు గొర్రెల గోవిందరాజులు, కార్యదర్శి రాయి శివనాగేశ్వరరావు, చప్పిడి వెంకటేశ్వరరావు, కడలి శ్రీనివాసరావు, బొంతు ధనలక్ష్మి, సూదా నాగవెంకటలక్ష్మి, గుబ్బల త్రిమూర్తులు, గుత్తుల రాజు, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామలో భీమేశ్వర టైలర్స్‌డే వేడుకలు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్, కోశాధికారి ఏడుకొండలు, కేశనకుర్తి వెంకటేశ్వరరావు, రైల్వేబోర్డు సభ్యుడు పెయ్యల రాంబాబులు విలియమ్స్ హో చిత్రపటానికి నివాళులర్పించారు.

కె.గంగవరం: కె.గంగవరంలో మిలియమ్ హోమ్ చిత్రపటానికి టైలర్లు నివాళులర్పించారు.సీనియర్ టైలర్ గుండుబోతుల సూర్యచంద్రరావును సన్మానించారు. టైలర్లు కుడుపూడి చంద్రరావు, పిల్లి భీష్మాచార్యులు, మట్టపర్తి వరప్రసాద్, శీలామంతుల బాలాజీ, పెండ్యం సత్తిబాబు పాల్గొన్నారు.

కాట్రేనికోన: శ్రీనవోదయ అభ్యుదయ టైలర్స్ సంఘం ఆధ్వర్యంలో టైలర్స్ డే కాట్రేనికోనలో జరుపుకున్నారు. హో చిత్రపటానికి నివాళులర్పించారు. టైలర్స్ సంఘం అధ్యక్షుడు విత్తనాల వెంకటవరప్రసాద్, బాషా, డి.శ్రీను, వెంకటేశ్వరరావు, వి.సతీష్, వి.సత్తిబాబు, బి.శ్రీను, గణేష్, సుబ్బారావు పాల్గొన్నారు.

మామిడికుదురు: టైలర్ల సమస్యల పరిష్కరించాలని మదర్‌థెరిస్సా ప్రైమరీ టైలర్స్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సభ్యులు కోరారు.మామిడికుదురులో విలియంహో విగ్రహానికి సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ పూలమాలలువేసి నివాళులర్పించారు. సంఘ అధ్యక్షుడు యింటి గణపతి, కార్యదర్శి ఉంద్రు శ్రీనివాసరావు, కోశాధికారి బత్తుల కల్యాణచక్రవర్తి, చుట్టుగుళ్ల కిశోర్, వాసంశెట్టి శంకరరావు, చెల్లింగి నాగరాజు, తోట దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పి.గన్నవరం: పి.గన్నవరంలో శ్రీకోదండరామ టైలర్స్ యూనియన్ అధ్యక్షుడు తోలేటి సుబ్బారావు ఆధ్వర్యంలో విలియమ్స్‌హో చిత్రపటానికి నివాళులర్పించారు. జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు జెండాను ఆవిష్కరించారు. అడ్డగళ్ల వెంకటసాయిరాం, కొక్కిరి రవికుమార్, యూనియన్ నాయకులు సంసాని బ్రహ్మయ్య, తరపట్ల సింహాచలం, కొపనాతి రాము, శీలం ప్రసాద్, తోలేటి నాగేశ్వరరావు, బొరుసు సౌజన్య, ఎం.రాజు, బి.సత్యవతి పాల్గొన్నారు.

అంతర్వేది: సఖినేటిపల్లి సెంటర్‌లో టైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో టైలర్స్‌డే నిర్వహించారు. కార్యక్రమంలో కొల్లు కృష్ణ, కామన గణపతి, చొప్పల చిట్టిబాబు, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: టైలర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మండల టైలర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. స్థానిక బస్టాండ్ వద్ద విలియమ్ హో చిత్రపటానికి పలువురు టైలర్లు పూలమాలలు వేశారు.

కపిలేశ్వరపురం: అంగరలో శ్రీఆదిగణపతి టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్‌డే నిర్వహించారు. అసోసియేషన్ గ్రామ అధ్యక్షుడు సీహెచ్ సోమేశ్వరరావు, మండల అధ్యక్షుడు ఎల్.సుబ్రహ్మణ్యం విలియమ్స్ హో చిత్రపటానికి నివాళులర్పించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామి, డైరెక్టర్ కంద చక్రవర్తి, జె.వెంకటరమణ, కె.సత్యనారాయణ, వెల్ల నాగేశ్వరరావుపాల్గొన్నారు.

అల్లవరం: అల్లవరంలో లక్ష్మీవేంకటేశ్వర టైలర్స్ సహకార సంఘాల ఆధ్వర్యంలో విలయమ్ హో చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ప్రెసిడెంట్ కడలి సాయిబాబు, విప్పర్తి రామకృష్ణ, బొర్రా సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక



మండపేట, ఫిబ్రవరి 28: మండ పేటకు చెందిన కోళ్ల గోవిందరాజు తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ సమక్షంలో టీడీపీలో చేరారు. మండపేట శివారు మారేడుబాకలోని బాలాజీ గార్డెన్స్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో చోడ బత్తుల కృష్ణ, జెగత్తె శ్రీను, చిట్టూరి శ్రీను, గుబ్బల సుబ్బారావు, 50మంది పార్టీలో చేరారు. ఎన్నికల్లో టీడీపీ విజయానికి పనిచేస్తామని వారు చెప్పారు.

'పది' పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 28: పదో తరగతి పరీక్షలను సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లపై ఉందని ఆర్జేడీ జి.నాగమణి పేర్కొన్నారు. పది పరీక్షలకు సంబంధించి ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో బుధవారం డీఈవో ఎం.కమలకుమారి అధ్యక్షతన సీఎస్‌లు, డీవోలకు నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆర్జేడీ మాట్లాడారు. మార్చి18నుంచి పదో తరగతి పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీఈవో కమలకుమారి మాట్లాడుతూ జిల్లాలోని 112కేంద్రాల్లో 118మంది పరీక్షలు రాయనున్నట్టు తెలిపారు. సీనియర్ ఎంఈవో బొజ్జా రమణశ్రీ, సీనియర్ హెచ్ఎం బి.కామేశ్వరరావు.. పరీక్షలను సున్నితంగా, సజావుగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు అందించారు. రామచంద్రపురం డీవైఈవో శ్రీపాద నరసింహఫణి, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ నక్కాసురేష్, డీసీఈబీ కార్యదర్శి బి.హనుమంతరావు, సెక్టోరియల్ అధికారులు డి.రమేష్‌బాబు,సమగ్రశిక్షా సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, పి.రాంబాబు, డాక్టర్ ఎంఏకే భీమారావు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

కాట్రేనికోన, ఫిబ్రవరి 28: బ్రహ్మసమేధ్యంలో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ అన్నారు. బ్రహ్మసమేధ్యంలో స్వయంసిద్ధంగా వెలసిన సంతాన ప్రదాత కాలభైరవస్వామి నూతన ఆలయంతో పాటు కాలభైరవస్వామి, బ్రహ్మేశ్వరస్వామి, దుర్గమ్మ, గంగమ్మ, నవగ్రహాల విగ్రహాలను బుధవారం ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే పొన్నాడ దంపతులు, సర్పంచ్ మల్లాడి వీరబాబ్జి దంపతులు, మాజీ సర్పంచ్ మల్లాడి నారాయణరావు దంపతులు, కోలాటి సత్యం, కోలా వీరయ్య పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 28: ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో అన్నదాన పథకానికి విజయవాడకు చెందిన నల్లమోతు విశ్వనాథరావు రూ.1,00,111విరాళాన్ని ఆన్‌లైన్‌లో సమర్పించినట్టు ఈవో కృష్ణచైతన్య తెలిపారు.

వేడుకగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

అల్లవరం, ఫిబ్రవరి 28: తాడికోనలో నిర్మించిన రామాలయంలో శిరంగు సత్యనారాయణ-లక్ష్మి దంపతులు కర్తలుగా విగ్రహాల ప్రతిష్ఠ బుధవారం జరిగింది. వేదపండితుడు సుదర్శనం వెంకటజనార్దనాచార్యులు ఆధ్వర్యంలో పూర్ణాహుతి, హోమాలు, హనుమత్ సీతాలక్ష్మణ సమేత శ్రీరాముని విగ్రహాలను ప్రతిష్ఠించారు. స్వామివారి దర్శనానికి, అన్నసమారాధనకు భక్తులు పోటెత్తారు.

ఘనంగా అమ్మవారి జాతర మహోత్సవం

రావులపాలెం,ఫిబ్రవరి28: ముమ్మిడివరప్పాడులో శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఘనంగా జరిగింది. గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, బాణసంచా కాల్పులు ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.